నూరేళ్ళ తెలుగు కథకు
నవ్య నీరాజనం - 72
నూరేళ్ళ తెలుగు కథకు



# మొగిలిచెర్లే నా విశ్వవిద్యాలయం


## - శ్రీమతి పవని నిర్మల ప్రభావతి

తెలుగు కాల్పనిక రంగంలో రెండవ తరం రచయిత్రుల్లో ప్రముఖంగా పేర్కొనదగిన శ్రీమతి పవని నిర్మల ప్రభావతి దశాబ్దాల పాటు అక్షర దీపాలు వెలిగించిన విదుషీమణి. 35 నవలలు, 9 కథా సంపుటాలు, 8 పైగా అద్భుత ఆధ్యాత్మిక గ్రంథాలు వెలువరించారు. ప్రస్తుతం 'భక్తిసుధ' మాసపత్రికలో 'శివానందలహరి' ధారావాహికగా రాస్తున్నారు. ఆదర్శ గృహిణి, మహిళ, రచయిత్రి, సామాజిక కార్యకర్త...బహుముఖీనంగా నిర్మల దృక్పథంతో ప్రతిభావంతంగా సేవలందించిన నిర్మల ప్రభావతి, ఇవాళ తెలుగు పాఠకులకు 'నవ్య నీరాజనం' అందించేందుకు ఒక్కొక్క పలుకే బంగారంలా పలికిన, ఆర్ద్రత నిండిన సన్నివేశంలో సేకరించిన సమాచారం మీకోసం...

## ఎంతెంత దూరం

వ్యక్తిగతంగా గత కొంతకాలంగా నిర్మల ప్రభావతిగారిని కలవాలని తపన. ఎక్కడున్నారు? ఎలా వున్నారు? అని కొందరిని అడిగితే తెలీదని సమాధానం. ఆఖరికి వారికి, వారి కుటుంబానికి అత్యంత ఆత్మీయులు, తెలుగు భాషాభిమాని, సాహితీ బంధువు, కృజిరసం అధ్యక్షులు శ్రీ గుత్తికొండ సుబ్బారావు ద్వారా వివరాలు తెలిశాయి. అయినా మార్గం సుగమం కాదు. ఇంతలో నవ్య ఎడిటర్ నీరాజనం అడిగారు. సరేనన్నాను. కాలం గడుస్తోంది. తాత్సారం చేస్తే లాభం లేదని, వెళ్లి రాక తప్పని పరిస్థితి'. ఆ మాటే అంటే వ్యయ ప్రయాసల కోర్చి అసాధ్యాన్ని సుసాధ్యం చేసి మిత్రుడు సుబ్బారావు తోడ్కొని వెళ్లకపోతే ఇవాళ ఈ ఇంటర్వ్యూ లేదు.

హైదరాబాద్ టు మొగిలిచర్ల...



పూజవేళ ప్రభావతి

## ఆమె, అతడు

ఆ ఊరికి ఆవిడ రాణి, ఆయన రాజు. చైతన్యమూర్తులై, సాహిత్య, సామాజిక, ఆధ్యాత్మిక సేవాతత్పరులై ఏలారు. ప్రజలు హృదయాల్లో వారి కోసం గుడి కట్టి పూజించారు. ఈరోజు వైభోగాలన్నీ అలాగే వున్నాయి. అనురాగాభిమానాలు దూరం కాలేదు. కానీ రాజు, రాణి కరచరణాలు కదిలించలేని స్థితిలో ఉన్నారు. మమ్మల్ని చూడగానే వెలిగే కన్నుల్లో కాంతి ఎగసిపడింది. చిరునవ్వుల్లో ఆత్మీయత హృదయ స్పర్శగా మారింది. ఆ రాణి శ్రీమతి పవని నిర్మల ప్రభావతి, రాజు శ్రీ పవని శ్రీధరరావు. కుమారుడు నాగేంద్ర ప్రసాద్, పెద్దకోడలు కమల, చిన్నకోడలు జయలక్ష్మిల సాయంతో ప్రభావతి



భర్తతో...

పెదవుల కదలికలు నవ్యకు నీరాజనాలందించాయి. ఆవిడ బయోడేటా, పుస్తకాలు మరిన్ని వివరాలు తెలియజేశాయి.

పుట్టినరోజు 12వ తేదీ మార్చి 1939. నాన్న విప్పగుంట వెంకట నరసింహారావు మున్సిఫ్ మేజిస్ట్రేట్. అమ్మ సరస్వతి గృహిణి. తండ్రి ఉద్యోగరీత్యా కనిగిరిలో పుట్టినా కావలి, ఒంగోలులో చదువు సాగింది. స్కూల్ ఫైనల్ చదివారు. హిందీ విశారద పాసయ్యారు. నాన్నగారికి సాహిత్యం అంటే అభిమానం. ఇంటికి భారతి, ఆంధ్రపత్రిక వంటివి వస్తుండేవి. జాతిని స్వాతంత్ర్య సమరానికి సమాయత్తం చేసిన కృష్ణాపత్రిక వుండనే వుంది. నిర్మల సృజనను తండ్రి ప్రోత్సహించారు. ఆమెకు ఒక అక్క, నలుగురు చెల్లెలు, ఒక తమ్ముడు.

''నా మొదటి కథ 'ఇంటి దొంగలు' కృష్ణాపత్రికలో వచ్చింది 1954లో. తర్వాత యువ, జ్యోతి, తరుణ మొదలైన అనేక పత్రికలు..''

మొదటి కథ అచ్చయి, అచ్చులో పేరు చూసుకుంటున్న తరుణంలోనే 11-3-1954లో మొగిలిచర్ల వాస్తవ్యులు పవని శ్రీధరరావు గారితో వివాహమై మెట్టినింట అడుగుపెట్టింది 15 ఏళ్ల రచయిత్రి నిర్మల ప్రభావతి.

## ఆయనే కాపీ రైటర్

కందుకూరు నుంచి 60 మైళ్లు లోపలికి వున్న కుగ్రామం లింగసముద్రం మండలంలో వున్న మొగిలిచర్ల. 1980 వరకూ ఆ ఊరికి కరెంటు లేదు. చుట్టూ అడవి. మాలలా చుట్టుకున్న మాలకొండ. నడకదారి మట్టి, కంకర రాళ్లమయం. అటు 'మన్నేరు' అనే మార్కండేయ నది. మార్గమధ్యంలో చిరుతలు, పాములు, ఇతర మృగాల భయం. ఎక్కడికి వెళ్లాలన్నా ఎడ్లబండే వాహనం. పెద్ద వ్యవసాయం. ఉమ్మడి కుటుంబం. పది పాడి గేదెలు, 5 జతల ఎడ్లు, ఆవులు-పాడి-పంట, వచ్చే పోయే అతిథి అభ్యాగతులు. పగలు ఈ పనులన్నీ స్వయంగా చేసుకుంటూ, పాలు పితకడం, చల్ల చేయడం, వంటా వార్పూ అన్నీ తానే! రాత్రి పూట కిరసనాయలు దీపం దగ్గర రచనలు చేసే అర్ధాంగిని చూసి అనురాగంతో ''ప్రభా! ఎన్ని రాస్తున్నావు, ఏం రాస్తున్నావు కాదు ముఖ్యం. సమాజ సమస్యలను ప్రతిబింబిస్తూ వాటికి పరిష్కారాలు చూపగలిగేదే ఉత్తమ సాహిత్యం అవుతుంది. అదే నీ లక్ష్యం కావాలి'' అన్న సూచన ఆమెకు శిరోధార్యం. 1955 నుండి ఈనాటి దాకా అదే ధ్యేయంతో రచన సాగుతోంది. ఆమె ప్రతి సృజనకు అతనే ప్రూఫ్ రీడర్, 'ఫెయిర్ కాపీ రైటర్' పైగా అతనే గురువు, దైవం, మార్గదర్శి. అర్ధనారీశ్వరత్వం వారి దాంపత్యం, సోషల్ యాక్టివిస్ట్ అయిన శ్రీధరరావు గారికి సమాజసేవ. నిర్మల ప్రభావతిది సాహిత్యసేవ. రెండూ పరస్ప

రాశ్రితాలు. సమన్వయ భావనా ప్రోత్సాహకాలు.

### విశ్వవిద్యాలయం, గురువు, పాఠశాల

ప్రకృతే పాఠశాల. నేల, నీరు, గాలి, చెట్టు, పుట్ట, పక్షి గురువులు. మొగిలిచర్లే విశ్వవిద్యాలయం. పల్లెటూరి అందాలు, మమతలు, మానవ సంబంధాలు, అమాయకత్వాలు ఆమెని ప్రభావితం చేశాయి. పానుగంటి సాక్షి వ్యాసాలు, శరత్ సాహిత్యం, విశ్వనాథ రచనలు నిర్మల సాహిత్యశైలికి పునాదులు వేశాయి. సాహిత్యంలో అన్ని శాఖలు తరచి చూసి తనదైన ముద్ర వేసుకున్న ప్రతిభావతి ప్రభావతి. ఆమెది విలక్షణ శైలి. కథనంలో మార్దవం, లాలిత్యం, సౌకుమార్యం తొణికిసలాడుతూ వుంటాయి. ప్రతి వాక్యంలో ఆత్మీయస్పర్శ వుంటుంది. ప్రధానంగా ప్రభావతి స్త్రీ పాత్రలు నిండుగా, నిర్భయంగా, స్వేచ్ఛగా ప్రవర్తిస్తాయి. అభ్యుదయ, ఆధునిక ధోరణిలో సంస్కృతీ సంప్రదాయల్ని తరచి చూడడం ఆమె ప్రత్యేకత. సాంఘికం, ఆధ్యాత్మికం ఏదైనా సరే అదే దృష్టి కోణం. అందుకే అద్భుత రీడబిలిటీ ఆ రచనలకు. అనేక రచనలు హిందీ, కన్నడ భాషల్లోకి అనువదితమయ్యాయి.



### కంకణధారణ

ప్రభావతి, శ్రీధరరావు దంపతులు గ్రామాభివృద్ధికి కంకణం కట్టుకున్నారు. 1980 వరకూ విద్యుత్ లేని ఆ గ్రామానికి విద్యుత్ వెలుగులు తెప్పించారు. 1973లో ఒంగోలు అగ్రో ఇండస్ట్రీస్ కార్పొరేషన్ సహకారంతో రోడ్డు వేయడానికి అనువుగా కొండను మలిపించే కార్యక్రమం చేపట్టారు. భర్త శ్రీధరరావు స్థాపించిన 'కందుకూరి తాలూకా రచయితల సంఘం' కార్యక్రమాల నిర్వహణలో ప్రభావతిది యాక్టివ్ పాత్ర. దత్తాత్రేయ మందిర నిర్మాణానికి కేటాయించిన తమ పొలంలో బావి తవ్వించి, పాతాళగంగను పైకి తెప్పించారు. సుమారు 100 ఎకరాల పైగా విస్తీర్ణంలో చుట్టుపక్కల ఎక్కడా నీటి చుక్కలేదు. అటు మన్నేరు, ఇటు 'తమిద పిండి వాగు' తప్ప జలాశయం అంటూ లేని ఎడారి బీడు భూమిలో బావి తవ్వించి జలదానం చేశారు.

వర్క్ ఈజ్ గాడ్ అని నమ్మే నాస్తికవాది పవని శేషయ్యగారు, ప్రభావతి మామగారు. సాధారణ సంప్రదాయ కుటుంబంలో ఆడవాళ్లు 'నెల సరి'కి అంటు, ముట్టు అని మూల కూర్చోవడానికి ఆయన వ్యతిరేకి. అత్తగారు నారాయణమ్మ నిరతాన్నదాత. కనీస వైద్య సదుపాయం లేని మొగిలిచర్లలో ఎవరికి జబ్బు చేసినా 25 మైళ్లు కందుకూరు గాని, 30 మైళ్లు కావలి గాని వెళ్లాల్సిందే! 1936లో కలరా వచ్చి గ్రామంలో చాలా మంది మరణించారు. 1951 నుండి శ్రీధరరావు పర్యవేక్షణలో ఆస్పత్రి నడుస్తోంది. కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు, పిల్లలకు వ్యాక్సిన్‌లు, క్షయ రోగాలకు చికిత్స, రోగ నిర్ధారణ, ఉచిత వైద్య సదుపాయాలు అందుబాట్లోకి తెచ్చారు. మాతా శిశు సంక్షేమం, తదితర ఆరోగ్య అవగాహన కార్యక్రమాల్లో ప్రభావతి ముందుండి భర్తకి చేదోడు వాదోడుగా పనిచేశారు. మామగారి నాస్తిక నిరీశ్వరవాదం, భర్త సోషలిజం 15వ ఏట నుండీ సన్నిహితంగా గమనించి, పుణికి పుచ్చుకున్న ప్రభావతి రచనల్లో ఆధునిక భావాలు, అభ్యుదయ ధోరణులు ప్రస్ఫుటంగా గోచరిస్తాయి. శ్రీ మాల్యాద్రి లక్ష్మీ నృసింహస్వామి ఆలయ సంస్కర్తలు, ట్రస్ట్ బోర్డు చైర్మన్ శ్రీధరరావుగారు. దాదాపుగా నిర్మల రచనలన్నీ ఆ స్వామికే అంకితం.ఇంటికి దీపం

### నచ్చినవి

| | | |
|---|---|---|
| కవి | - | ఆరుద్ర |
| కథాకథనం | - | బాపు |
| సినిమా | - | భీష్మ |
| హీరో | - | కాంతారావు |
| హీరోయిన్ | - | దేవిక |
| వంటకం | - | పనస పొట్టుకూర |
| పుస్తకం | - | రామాయణం |
| పాట | - | శాస్త్రీయ సంగీతం |
| రచయిత్రి | - | రంగనాయకమ్మ |
| పత్రిక | - | ఆంధ్ర పత్రిక |
| బెస్ట్ ఫ్రెండ్ | - | భర్త శ్రీధరరావు |

17వ ఏట టీనేజ్‌లో తొలిచూలు, 23వ ఏటికి ముగ్గురు పిల్లల తల్లి. ఇక సంతానం చాలని 1962లోనే కుటుంబనియంత్రణను చేయించుకున్న ధైర్యశాలి. హెచ్చులకి పోకుండా పిల్లల్ని చదివించి, జీవితంలో చక్కగా స్థిరపడేలా చేసి, ఊరందరికీ తల్లో నాలికగా తల్లి అయిన ఇల్లాలు ప్రభావతి. సాంఘిక ప్రయోజనాన్ని ఆశించే విశిష్ట రచనలు చేశారు. ఆవిడ ప్రతి రచనా ముగ్గురు పిల్లలు చదివారు. ''మా అమ్మా నాన్నల వల్ల మా అందరికీ మంచి పుస్తకాలు చదివే అలవాటు వచ్చింది. మా అమ్మకి మంచి హోమ్ లైబ్రరీ వుండేది. ఇప్పుడది కారణంతరాల వల్ల లేకపోవడం పెద్దలోటు. అమ్మ పుస్తకాలు కొన్ని అయినా అపురూపంగా దాచుకోగలగడం అదృష్టం..'' అని ఆమె చిన్న కొడుకు నాగేంద్రప్రసాద్ అన్నారు. ప్రభావతి పెద్ద కుమారుడు నాగప్రదీప్ (14-2-1956) హైదరాబాద్‌లో హైకోర్ట్‌లో అడ్వకేట్‌గా వున్నారు. నాగేంద్ర ప్రసాద్ (25-10-1960) బిజినెస్‌మాన్. కుమార్తె విజయలక్ష్మీ గాయత్రి (7-9-1962) పుణెలో కాపురం. తరచు అందరూ (మనుమలు, మనుమరాళ్లతో సహా) మొగిలిచర్లలో కలిసి సరదాగా గడుపుతుంటారు. మధురాంతకం రాజారాం, భీమ్‌సేన్ నిర్మల్, రంగనాయకమ్మ, కె.రామలక్ష్మి ఆరుద్ర, పిలకా గణపతి శాస్త్రి వంటి వారితో ఉత్తర ప్రత్యుత్తరాలు ఉండేవి.

### సృజన రేఖలు

శిథిలాల నుండి శిఖరాలు, ఆత్మజ్యోతి, సీత నడిచిన నేల, మనుషులు-మనసులు, కప్పలు, నాలుగిళ్ల లోగిలి, శంఖాలు, చైతన్య రాహిత్యంలో స్త్రీ వంటి నవలలు పేరు తెచ్చాయి. బాలల సంవత్సరంలో పెద్దలకో నవల (పెద్దల స్వార్థానికి బలి అవుతున్న పిల్లల బతుకులు చిత్రణ-ఎమెస్కో


ఇంటర్వ్యూ చేస్తోన్న కె.బి.లక్ష్మితో...

1979), 'పాపలు! పావులు!' రాశారు. ఆమె కథలన్నీ 9 సంపుటాలుగా వచ్చాయి. నవలల మీద కాకతీయవర్శిటీ, కథల మీద శ్రీ వేంకటేశ్వర వర్శిటీల్లో పరిశోధన చేసి డాక్టరేట్లు పొందారు. 1954 నుండి 1980 వరకు సాంఘిక కథ, నవల రాసిన నిర్మల ప్రభావతి తదాదిగా పూర్తి స్థాయి ఆధ్యాత్మిక గ్రంథాలు రాశారు. ఏది రాసినా సర్వసమగ్రంగా, సంపూర్ణ శ్రద్ధతో రాయడమే లక్ష్యం.

నవకోటి లలితా మంత్ర జపం పూర్తి చేసిన ఆధ్యాత్మికశీలి. ప్రభావతి లలితా సహస్రనామ వ్యాఖ్య ఆమె అనుష్ఠాన నిదర్శనం. శ్రీ మాల్యాద్రి లక్ష్మీనృసింహస్వామి భక్తురాలు, మొగలిచర్ల అవధూత ఆశీస్సులు పొందిన పవని నిర్మల ప్రభావతి రామాయణ రసవాహిని, సుందర కాండ, భాగవతామృత కలశం, షిరిడీ సాయినాథ భాగవతం (కన్నడం లోకి అనువాదం) వంటి 9 ఆధ్మాత్మిక గ్రంథాలు వెలువరించారు.

ఆరోగ్యంగా వున్నప్పుడు రాయడం, అనారోగ్యంతో చేతకాక పోతే డిక్టేట్ చేయడం. అంతేగాని రచన ఆపింది లేదింత వరకు. 'మొగిలిచర్ల అవధూతతో మా అనుభవాలు' గ్రంథం సాక్షాత్తూ ప్రభావతి ఆత్మకథ అంటే అతిశయోక్తి కాదనిపిస్తుంది. ఆకాశవాణిలో 'పంకంలో పద్మాలు' వంటి నాటికలు, సీరియల్స్, ప్రసంగ వ్యాసాలు అనేకం ప్రసారమయ్యాయి. కృష్ణా పత్రికతో మొదలైన సాహితీ ప్రస్థానం యువ, జ్యోతి, ప్రభ, పత్రిక వంటి అనేక పత్రికలలో కొనసాగింది.

## కాలమిస్ట్

ఇయంగేహేలక్ష్మి, కుంకుమరేఖలు, మహిళాజాగృతి కాలమిస్ట్‌గా ప్రసిద్ధురాలు.

## అవార్డులు, రివార్డులు

1983 తెలుగు విశ్వవిద్యాలయం మధురకవి నాళం కృష్ణారావు అవార్డ్, 1994 తె.. వి.. వి విశిష్ట రచయిత్రి పురస్కారం, 2008 వాకాటి పాండు రంగారావు స్మారక పురస్కారం అందుకున్నారు. మరెన్నెన్నో సంస్థల సత్కారాలు ప్రశంసలు... 1994 తర్వాత ప్రభావతిని దాదాపుగా సాహితీ లోకం మరిచింది.

## నేటి సాహిత్య ధోరణులు

'భగవదానుగ్రహం వల్ల సంతృప్తికరమైన గృహస్థ జీవితం లభ్యమైంది. ఈ సాహిత్య సేవ కూడా భగవంతుని వరమే! ప్రశాంతమైన జీవితం సాగిపోతోంది' అని 2000లో 'శివదూతీ సప్తతి!' గ్రంథంలో రాసుకున్నారు. నేటి సాహిత్య ధోరణుల గురించి అడిగితే...''నచ్చడం లేదు. ఉపయుక్తంగా లేవు. చదవడానికి బాగున్నా సమాజానికి వాటి వల్ల ఎటువంటి ప్రయోజనం లేదని, రచనల్లో సమాజహితం, అభ్యుదయం ఉండాలి'' అని చెప్పారు ప్రభావతి.

## ఇది పలుకు పలుకుగా ఎద తేనియల మాగె...

2001 నుండి అడపాదడపా రక్తపోటు వంటి చిన్నచిన్న అనారోగ్యాల ఆటుపోట్లను తట్టుకుని నిలబడ్డారు. తర్వాత కాలికి దెబ్బ. రాడ్‌తో, చక్రాల కుర్చీలో ఒంటిచేత్తో ఇంటి పూర్తి బాధ్యత నిర్వహణ. మే 20, 2010 నుండి లేవలేని స్థితి. మంచానికే పరిమితం. కేవలం సెలైన్ ఆధారం. అప్పుడప్పుడు మజ్జిగ, అత్యంత తేలికపాటి ఆహారం లేచి కూర్చోలేరు. కూర్చుందామన్నా వద్దన్నారు డాక్టర్లు. ఇదీ ప్రస్తుత పవని నిర్మలగారి పరిస్థితి. దేవీకళ ఉట్టిపడే ముఖవర్చస్సు మాత్రం చెక్కు చెదర లేదు. సంపంగి వంటి నాసిక మీద రెండు వైపులా బేసరీలు తళుక్కుమంటుంటే, మెరిసే కళ్లతో, వెన్నెల లాంటి చిరునవ్వుతో సోదరతుల్యుడు గుత్తికొండ సుబ్బారావును, కార్యార్థినయిన నన్ను స్వాగతించిన ప్రభావతి వ్యక్తిత్వం, సాహిత్యం అవిభాజ్యం. కొత్తచీర, జాకట్టు, పూలు, పసుపు కుంకుమ చేతి కదలికలతోనే అందుకున్నారు. లేత గులాబీరంగుకు నీలాకాశం రిబ్బన్ అంచు వెంకటగిరి జరీ చీర అందిస్తూ ''చీర బాగుందా? రంగు నచ్చిందా?'' అని నేనడిగితే ఒక అత్యంత అపురూప అద్భుత సుందర దృశ్యాన్ని చూస్తున్నట్లు మెచ్చుకోలుగా నా కళ్లలోకి చూసిన ఆవిడ చూపు ఆత్మీయంగా నా గుండెను తాకింది. కనులు చెమ్మగిల్లాయి.మొగలిచర్ల 'మొగల్'లా వెలిగిన శ్రీధరరావు గారు పక్షవాతంతో ఒక కాలు, చెయ్యి పని చేయకపోయినా, మాట్లాడకపోయినా ఆదరంగా ఆహ్వానించి, అతిథి మర్యాదలు చేశారు. ప్రభావతి గారితో నేను మాట్లాడి నోట్ చేసుకున్న పాయింట్స్‌ని కళ్లజోడు తీసి పెట్టుకుని చూశారు. ''మీ బెస్ట్ ఫ్రెండ్ ఎవరు అని అడిగితే, నా భర్త శ్రీధరరావు గారని చెప్పారావిడ'' అని నేనంటే నోరంతా తెరిచి ఎంతో హాయిగా నవ్వారు. ఒకరికి ఒకరైన ఆ జంట అలా చెరో మంచం మీద ఒకరినొకరు చూసుకుంటూ మౌనరాగాలతో మమతానురాగాలు పంచుకునే దృశ్యం చెదరిపోనిది.

''చెంగు చెంగునా గంతులు వేయండి! జాతివన్నె బుజ్జాయిల్లారా! నోరు లేని తువ్వాయిల్లారా!...'' అన్నట్లు దూడల్ని వదిలి స్వయంగా పాలు పితికి, పాడి, పంట చూసుకుంటూ, ఇంటి పూర్తి బాధ్యతలు, గృహస్థాశ్రమ ధర్మాలు నిర్వరిస్తూ, పాలేర్లకు అన్నం పెట్టాకా అందరూ నిద్రాదేవి ఒడిలోకి ఒరుగుతున్నవేళ స్థిమితంగా, ఓపిగ్గా తన రచనా వ్యాసంగం సాగించిన పవని నిర్మల ప్రభావతి, ఇవాళ దాదాపుగా దేవుడి పిలుపునకు ఎదురు చూస్తున్నట్లున్న స్థితిలో, కష్టపడి కూడ బలుక్కుని మెల్లిగా ఈ ఇంటర్వ్యూకు సహకరించిన వైనం వందేళ్ల తెలుగు కథకే కాదు, పాఠకులకూ నీరాజనం. నవ్య సాహితీ సృజనమూర్తుల్లో అత్యంత స్ఫూర్తిప్రదాయిని నిర్మలప్రభావతి పవని. ఆమె ఇలవేల్పు మాల్యాద్రి (మాలకొండ) లక్ష్మీనృసింహస్వామి ఆమెకి మనశ్శాంతి నివ్వాలని, ఈ ఇంటర్వ్యూ చూసుకుని సంతోషంతో ఆమె కన్నుల్లో కాంతులు విరియాలని మనసారా కోరుకుందాం.

–కె.బి.లక్ష్మి

నాకు నచ్చిన నా కథ

# మారిన కాలం మారని మనిషి

- పవని నిర్మల ప్రభావతి

"ఈ పీడ రేపటితో వదలిపోతుంది నాకు!" నెత్తిమీదున్న గడ్డి గంప విసురుగా నేలమీద బోర్లా పడేస్తూ అంది శేషమ్మ. వసారాలో మంచంమీద కూర్చునివున్న వెంకటాద్రికి శూలాల్లా తగిలాయి మాటలు.

"ఔనౌను! రేపట్నుంచి గోళ్లుగిల్లుకుంటూ రాణీలా కూర్చోవచ్చు నువ్వు నేనేమో ఎముకలు విరగేలా వూరువూరంతా చుట్టిరావచ్చు!" అన్నాడు భార్యకేసి మిర్రిచూస్తూ.

శేషమ్మ క్షణకాలం దిమ్మెరపోయింది. ఈ వేళప్పుడు భర్త అలా వసారాలో పని లేకుండా కూర్చుని వుంటాడని ఆమె ఊహించలేదు మాట్లాడకుండా కొడవలి చూరులో దోపి, గడ్డిగంప తేవటం మూలాన మాడుమీద గుంటలా వున్న జుట్టు సరి చేసుకుంటూ గుడిసెలోకి వెళ్ళింది. "ఎట్లాగూ రేపటితో శని వదిలిపోతూనె వుండె ఈ కాస్సేపులోపల నేనేదైనా అంటే తెగవుడుక్కుంటాడు. పోనీ కాసేపు నేనే నోరు మూసుకుంటే సరిపోయె!" అనుకుంటూ బుడ్డి దీపం వెలిగించే ప్రయత్నంలో పడింది.

వెంకటాద్రికి మాత్రం వెర్రికోపం ముంచుకు వస్తోంది. శేషమ్మకీ రోజు పీడగా కన్పిస్తున్న ఆ గుర్రం – ఆ బండీ తనకు మహాలక్ష్మిలా తోస్తాయి ఎల్లవేళలా! రేపటితో ఈ గుర్రం బండి తమ కళ్ళ ముందు నుంచీ, గుడిసె ముందు నుంచీ వెళ్ళి పోతాయి పీడ వదిలిపోతుందనీ, తనకి గడ్డికోసుకొచ్చే పని తగ్గిపోతుందని మురిసిపోతోందది. కాని మహాలక్ష్మి కదిలి పోతుందనిపిస్తోంది తనకు.

వెంకటాద్రి లేచి, గంపలో గడ్డి గుర్రం ముందు వేశాడు. అది ఆశగా తింటోంది. మెల్లిగా వెన్నంతా నిమిరాడు. ఆ స్పర్శకు ఏళ్ళ తరబడి అలవాటు పడిపోయిన ప్రాణి ఓ విధమైన పరవశత్వంతో క్షణకాలం అలా నిలబడి మెల్లిగా తిరిగి గడ్డి తినేస్తోందది.

"మీ అమ్మ నిన్ను కన్నప్పుడు దగ్గరున్నాం నేనూ మా అయ్యా! నీకు "ముత్యాలు" అని ముద్దుగా పేరెట్టింది నేనే! నీకు పచ్చగడ్డి పరకలు కొరకటం నేర్పింది నేనే! నీకు కళ్ళెం తగిలించి బండికి కట్టింది నేనే! – ఆనాటి నుంచి ఈ నాటి వరకూ నువ్వూ నేనూ – ఒక తల్లిపిల్లల్లా – (ఛ-ఛ ఒక్క తల్లి పిల్లలు మనుషులైతే ఎంతగా తన్నుకు చస్తారు? ఆ పోలిక పెట్టటం నాదే తప్పు!) స్నేహితుల్లా మెలిగాం. ఈ రోజు నిన్ను అమ్మెయ్యాలంటే నాకెంత బాధగా వుందో నీకు తెలుసా?"

గుర్రం వెన్ను నిమురుతున్న వెంకటాద్రి చెయ్యి వణికింది – "తిను-తిను అది ముక్కుతూ, మూలుగుతూ ఏడుస్తూ తిడుతూ తెచ్చిన ఈ గడ్డి – ఆఖరిసారిగా తిను. ఆ తర్వాత రేపట్నుంచీ నీ ఖర్మ ఎలావుందో? నా ఖర్మ ఎలా వుంటుందో?"

వెనక్కి వచ్చి వసారాలో మంచం మీద కూర్చున్నాడు వెంకటాద్రి. సంధ్య చీకట్లు బాగా ముసురుకున్నాయి. బుడ్డి దీపం తెచ్చి వాకిటి గూట్లో పెట్టి వెళ్ళింది శేషమ్మ. వెంకటాద్రి చుట్టూరా చీకటిలానే పరచుకుంటున్నాయి ఆలోచనలు అతగాడి కళ్ళ ముందు తన యవ్వనపు రోజులు సినిమా రీలులా తిరగటం మొదలెట్టాయి.

***

అప్పటికి నెల్లూరు ఇంతగా పెరగలేదు. నాలుగు సినిమా హాళ్ళూ, ఒక కాలేజీ మాత్రమే వుండేవి. అటు రైలు కట్టకు ఇవతలగానీ, అవతలగాని ఇన్ని ఇళ్ళు లేవు! అక్కడా అక్కడా ఒకటి అలా విసరేసినట్లుండేవి ఇన్ని బస్సుల్లేవు! కోవూరుకూ, అల్లూరుకూ, బుచ్చిరెడ్డిపాళేంకీ పడుగుపాడుకూ, రాజుపాలేనికీ మధ్య జోరుగా పరుగెత్తుతుండేవి గుర్రపు బండ్లు! ఎవరో ఒకరో అలా కారున్న మహారాజులు మినహా, స్వంత గుర్రపు బండ్లమీద వెళ్ళేవారు చాలామంది!

వెంకటాద్రికి పిల్లనిస్తానంటూ వచ్చిన రామయ్య, వెంకటాద్రి వాకిట్లో వున్న బండినీ వసారాలో ఓ మూలగా కట్టేసివున్న బలిష్టమైన గుర్రాన్ని చూచి తెగ ముచ్చటపడి పోయాడు. కాబోయే అల్లుడికంటే... ఆ "ఆస్తి" చాలా గొప్పగా కనిపించిందతగాడికి. పిల్ల సుఖపడటానికి ఇంతకంటే ఏంకావాలి అనుకున్నాడు. "రాజా" లాటి గుర్రం, బండీ మహారాజులా సంపాదించుకోవచ్చని శేషమ్మ కూడా సంతోషించింది. తన భర్తా "కలిగిన" వాడేనని సంబరపడింది. దానికితోడు ఓ బిడ్డ తల్లి అయ్యేవరకూ వెంకటాద్రి శేషమ్మను కాలు కింద పెట్టనివ్వలేదు. సినిమాకు పోవాలన్నా గుర్రపు బండిలోనే. రంగనాయకుల కోవెలకు వెళ్లాలన్నా గుర్రపు బండిలోనే. నెల్లూరంతా తిప్పి చూపించాలన్నా బండే! సంత జరిగినా, తిరణాల జరిగినా తేరుమీద వూరేగే దేవుడిలా వూరేగించేవాడు.

"బాడుగ పోతోంది మావాః! ప్రతి చోటికీ బండెందుకూ!" అనేది శేషమ్మ గునుస్తూ!

"నీ కంటే ఎక్కువేటి బాడుగ. కాకున్నా సొంత బండీ, సొంత గుర్రం. మనిష్ట మొచ్చినప్పుడు మనిష్ట ప్రకారం తిరగొచ్చు! రెండు ట్రిప్పులు కోవూరుకో, పడుగుపాడుకో, రాజుపాలేనికో, బుచ్చికో

## నాకు నచ్చిన నా కథ



"ఈ ప్రశ్నకు సమాధానం కష్టం. అన్నీ నచ్చినవే. అయినా 1992లో రాసిన 'మారిన కాలం, మారని మనిషి' ఇష్టం. విశ్లేషించ లేను. చదివితే తెలుస్తుందిగా!"

–పవని నిర్మల ప్రభావతి
ఫోన్: *99089 – 73699*

ఏసుకున్నానంటే నాలుగు రోజులు మనిద్దరం జలసాగా బండిమీద వూరేగొచ్చు... ఏమంటావ్?'' అనేవాడు. వెంకటాద్రి గర్వంగా! అసలా వీధిలో చాలామంది ఆడవాళ్ళు ముఖ్యంగా కొత్తకోడళ్ళు శేషమ్మ వైభవం చూచి ఈర్ష పడే వాళ్లు.

''అదృష్టమంటే దానిది! చక్కగా ఎక్కడికి వెళ్లాలన్నా బండి మహారాణిలా!'' అనుకొనే వారు శేషమ్మ వినేలా కూడా అనేవారు! ఆ మాటెంతో గర్వంగా మొగుడితో చెప్పుకొనేది శేషమ్మ!

''మన ముత్యాలు చల్లగా ఉండాలేగాని మనకేమిటి లోటు?'' అనేవాడు వెంకటాద్రి గర్వంగా, ఆ హుషారు కొద్దీ శేషమ్మ, వెంకటాద్రి అటు బండి కట్టుకెళ్ళగానే... ఇటు గడ్డికి పోయేది! ఎటుచూచినా కావలసినంత బీడు... పచ్చని గడ్డి... అక్కడక్కడా చిన్నచిన్న మడుగుల్లో గుర్రాలకు నెత్తిమీద పెట్టేందుకు తమాషాగా ఉండే రంగురంగుల పూలు! రెండు గంటలలో నాలుగు గంపల గడ్డీ దోక్కొని నాలుగు పూలు లాక్కొని ఇంటికి రావటం శేషమ్మకు అలవాటైపోయింది. గుర్రం తినంగా మిగిలిన గడ్డిబండిలో మెత్తగాపరచి, ఇంకా మిగిలితే గోనెపట్టలో వేసి, బండిక్రింద వుయ్యాలలా వ్రేలాడదీసి.... ''పద ముత్యాలూ'' అంటూ గుర్రాన్ని బండికి కట్టి... ''నీ హస్తవాసి శేషూ! ముత్యాలు రోజుకో వన్నెతో పంచకళ్యాణిలా తయారవుతోంది!'' అంటూ భార్యకేసి కన్ను గీటి, బండిలో బోర్లాపడుకొని చెలకోల కొయ్య శబ్దం చెయ్యగానే... పంచకళ్యాణిలానే పరుగుతీస్తుంది ముత్యాలు...

బండికి ముత్యాలును అలవాటుచేసే కొత్తలో బాగా కూర్చునేవాడు వెంకటాద్రి. ''నే పుట్టినప్పట్నుంచీ చూస్తున్నారా ముత్యాలూ! ఈ నెల్లూరు రోడ్లు ఇట్లాగే వున్నాయి! ఎక్కడ గుంటో, ఎక్కడ మిట్టో... నాకే... నాకేమిటి? ఈ రోడ్లేసిన కాంట్రాక్టర్లకి... ఆ భగవంతుడికీ కూడా తెలీవు! వర్షమొస్తే చాలు... ఇక రోడ్లే నదులు... అదుగో ఆ అండర్ బ్రిడ్జి వుంది చూశావూ.... అదో సముద్రమై పోతుంది! ఎక్కడి బండ్లక్కడ ''ఆల్టు'' ఐపోవలసిందే! కళ్లు మూసుకొని దూకేవు ... అన్యాయంగా ఇద్దరం ఛస్తాం!..... నే చెప్పినట్టిను... అసలే ఈ రోడ్లు ఇరుకు. దానికితోడు రెండు వేపులా మురిక్కాలువలు. మురిక్కాలువల మీదికి ఇళ్ళూ.... జాగ్రత్తగా పరుగెత్తు!'' అంటూ గుర్రానికి అస్తమానం హెచ్చరికలు చేసేవాడు. తెలిసిన వాళ్ళెవరైనా ''అదే మిత్రా వెంకటాద్రీ! దానితో కబుర్లు చెబుతావ్! అదేం మనిషా? నీకు మతి పోయిందా?'' అంటూ ఎగతాళి చేసే వాళ్లు కూడాను.

అలాంటప్పుడు వెంకటాద్రి నవ్వేస్తాడు. ''అది గుర్రంగా పుట్టింది గానీ, మనిషి కంటే మా బాగా మాట వింటుంది!''

...నిజమే! ఓ రోజు... నెల్లూరు నుంచి బుచ్చివరకూ బేరం కుదుర్చుకున్నారు ఓ భార్యా, భర్త, భార్య తల్లీనూ. తల్లీకూతుళ్ళు ఏనుగుల్లా ఉన్నారు... ఆ అల్లుడు బొత్తుగా పీనుగులా వున్నాడు! బండిలో వాళ్ళు కూర్చున్నాక... కర్ణుడి రథంలా భూమిలోకి బండీ గుర్రము దిగిపోతున్నాయనిపించింది వెంకటాద్రికి.... ''బరువెక్కువైంది!'' అంటూ గొణుక్కుంటుంటే... ఎక్కుడూ, దిగుడూ వచ్చిన చోటల్లా,. తుండల్లా వున్న తల్లీకూతుళ్లు అలాగే కూర్చుని, చీపురుపుల్లలాటి అల్లుణ్ణి మాత్రం దింపేశారు... బండి విరుగుతుందని, అలాటి ఎందరినో అవలీలగా లాక్కువెళ్ళటం అలవాటయి పోయింది ముత్యాలుకు. రోడ్లకు ఎక్కడ గతుకులు వున్నాయో వర్షాకాలమైనా కనిపెట్టే మెలకువ వచ్చేసింది! ఎందరో పెళ్ళివారు, మరెందరో కొత్త దంపతులు, ఎందరో రోగులు.. ఎంతెంత దూరమో ప్రయాణించేవారు... ఓ అమ్మాయి... బాగా కలిగినింటి ఆడపడుచు... బండెడు నగలతో బండిలో కూర్చుంది. ట్రంకు రోడ్డు దాటేసరికి ఓ



కుర్రాడు వచ్చి కలిశాడు... స్టేషన్‌కు తీసుకెళ్లమని చెప్పాడు. ... త్రోవ పొడు గునా ఇద్దరూ మదరాసు వెళ్ళిపోవాలని... పెళ్లాడాలనీ... ఏదేదో మాట్లాడుకుం టున్నారు... వెంకటాద్రికి అర్థమై పోయింది అసలు సంగతి. ఆ అమ్మాయి తండ్రి పేరు కూడా తెలిసిపోయింది. వాళ్లిద్దరి మాటలలో... స్టేషనులో ఇద్దరూ దిగగానే... వెంకటాద్రి వాళ్ల వెనకాలే వెళ్లాడు... మద్రాసుకు వెళ్ళే బండి ఓ గంట లేటుందని తెలిసింది. గబగబా స్టేషను మాష్టరు దగ్గరకెళ్ళి రహస్యంగా అసలు సంగతి చెప్పి, ఎలాగైనా తను తిరిగి వచ్చేవ రకూ వాళ్లని ఓ కంట కనిపెట్టమని చెప్పి బండిలో వచ్చిపడ్డాడు!....



''ముత్యాలూ పదరా అవతల కొంప మునిగి పోతోంది! అయినింటి ఆడపిల్ల - కళ్లకు గంతలుకట్టని గుర్రప్పిల్లలా ఎగిరిపడు తోంది. ఏది గుంటో, ఏది మిట్టో తెలియనంత దూకుడుగా దూసుకుపోతోంది. ఆ కుర్ర వెధవ.... షోకీలా వెధవ... ఆ పిల్లనగలు కాజేస్తాడు... నాశనం చేస్తాడు... మనిద్దరం వుండగా... అలాటిఘోరం జరగనివ్వకూడదు.... పద పద...'' అతగాడి భాష, బాధ! ముత్యాలుకు అర్థమైందిలా వుంది.... గాలిలో తేలిపోతున్నట్టు పరుగెత్తింది... ఆ అమ్మాయి తండ్రి... కబురు తెలిసి అదిరి పోయాడు... ఇంటిల్లపాదీ గాభరాపడిపోయారు... కారున్న సంగతే మరచి పోయి... బండిలోకి దూకాడు ఆ తండ్రి కంగారులో... బండి ఫర్లాంగు సాగాక... ''అరె కారులో పోవలసింది! ట్రెయిన్ వస్తుందో ఏమిటో!'' అంటూ బాధపడ్డాడు. ''గాభరా పడకండి బాబూ! కారుకంటే తొందరగా తీసుకు పోతుంది మా ముత్యాలు. స్టేషనుమాష్టరుకి చెప్పొచ్చానుగా!'' అంటూ నే సేషన్‌కు... నిజంగా కారంతా వేగంగానే చేరుకుంది బండి! పిల్ల తండ్రిని చూచి కుర్రవాడు జారుకున్నాడు... అమ్మాయి కుక్కినపేనులా వచ్చేసింది తండ్రి వెంట!... ఆతర్వాత ఓ సంవత్సరం జరిగాక కాబోలు! ఓసారి వాళ్లకారు చెడి పోతే... అ అమ్మాయి ఆమె భర్త వెంకటాద్రి బండిలో సినిమాకు వెళుతూ సర సాలాడుకుంటుంటే వెంకటాద్రి నవ్వుకున్నాడు... ''విన్నావా ముత్యాలూ! ఈ పిల్లే - ఆ వెధవెవడితోనో లేచిపోయి... ఇంచక్కటి బ్రతుకునీ బుగ్గిపాలు చేసు కుందారోజు! ఇవాళ చూడు.... నన్నూ నిన్నూ గుర్తుబట్టలేదు! పోనీలే ఓ మంచి పని చేశాం కదూ?'' వెంకటాద్రి మూగభాష ముత్యాలుకు అర్థమైనట్లు... చిన్నగా సకిలించింది...

పదేళ్ళ గిర్రున తిరిగాయి...

సినిమా హాళ్ళు పన్నెండు అయినాయి! ఇంటిమీద ఇల్లుగా ఇళ్ళు వెలిసి పోయాయి! రోడ్లపక్కనున్న మురుగు కాలువలు మరింత మందంగా... మరింత కంపుకొడుతూ ప్రవహిస్తున్నాయి... రోడ్లు మరికాస్త ఇరుకుగా, ఇంకా ఎగుడుదిగుడులుగా... తయారయ్యాయి... ఆడపిల్లల కాలేజీ వెలిసింది. వీధికి పది ఆస్పత్రులూ, పదిహేనుమంది డాక్టర్లూ, మొలుచుకు వచ్చారు. హోటళ్ళూ, లాడ్ జీలు... బ్రోతల్ హౌస్‌లూ....

సైకిల్ రిక్షాలు వచ్చేశాయి! బస్సులూ, టౌన్ బస్సులూ వచ్చేశాయి!

శేషమ్మ ఐదుగురు పిల్లల తల్లయింది! ఇంతక్రితంలా పచ్చిక బయళ్ళు లేవు... అక్కడంతా ఇళ్ళూ ఆఫీసులూ.... కొత్తకొత్త ''నగర్''లూ వెలిసిపో యాయి! గుర్రప్పూలు కూడా ఆట్టేలేవు! రెండు గంటలు పోయేలా డోకుడు పారతో, కొడవలి లిక్కితో నేల చెక్కినా గంపతో గంపెడు గడ్డిపోగవటం లేదు. పచ్చిగడ్డి చిన్న మూట రూపాయి నుంచి రూపాయిన్నర ధర పలుకుతోంది! తిండి గింజలే దొరక్కుంటే, ఇక గుర్రానికి వులవెలా వస్తాయి రోజూ!

వెంకటాద్రిని ఇవేమీ కదిలించలేదు.

''వూరికే బాధపడకే శేషూ! రోజులన్నీ ఇట్లాగే వుండవులే! మంచి బాడుగలే వస్తాయిలే! గుర్రానికీ, మనకూ కావలసినంత దాణా దొరుకుతుందిలే!'' అన్నాడు అనంతమైన విశ్వాసంతో!

కానీ.... వెంకటాద్రికి ఆత్మవిశ్వాసం ఒక్కటీ అన్నం పెట్టడం లేదు! రిక్షాల జోరు హెచ్చింది...

''ముప్పావలా ఇస్తాను - వస్తేరా! రాకుంటే వెళ్ళు.... ముప్పావలా పారేస్తే... మూడు మైళ్ళు వెళ్ళొచ్చు రిక్షాలో!'' అంటూ... తను ఆలోచించి ఏ సంగతీ చెప్పేలోగానే, రిక్షాలో కూర్చుని వెళ్ళి పోతున్నారు జనం.

''బాబూ! రిక్షాలో కూర్చోండి! ఎట్లాంటి చుక్క కావాలంటే అట్లాంటి చుక్క కాడికి తీసుకుపోతా! ఏ లాడ్జికి కావాలంటే ఆ లాడ్జికి తీసుక పోతా!'' అంటూ గుసగుసలుగా చెప్పి గాలం వేస్తున్నారు కొందరు రిక్షావాళ్ళు! ఏకంగా కన్నె పిల్లల్నీ పడుచుకుర్రాళ్లనీ రిక్షాలలో కూర్చోపెట్టాక తెర అడ్డం వేసి... ఏకాంత ప్రదేశాలకో తరలిస్తుండటం పరిపాటయి పోయింది!

''బండి కడతావా అబ్బీ!'' అన్నారో పడుచు జంట.

''కడతాను బాబూ! ఎక్కడికెళ్ళాలి?'' అన్నాడు వెంకటాద్రి.

కుర్రాడు కొంటెగా ఆ అమ్మాయికేసి చూసి కన్నుగొట్టాడు. అమ్మాయి... అంగీకార సూచకంగా చిరునవ్వు నవ్వి వూరుకుంది! ఆ అమ్మాయి... కాలేజీలో చదువుతున్న పిల్ల! పెళ్ళికాని పిల్ల...! వెంకటాద్రి గుండె క్షణకాలం గుబగుబ లాడింది. ''దర్గామిట్ట దాటి...'' ఆ కుర్రాడేదో చెప్పబోయాడు...

''నాకు వేరే బేరముందిలే బాబూ! ఇట్లాంటి పనులకు నే రాను!'' అనేశాడు వెంకటాద్రి రోషంగా.

ఆ కుర్రాడు క్షణకాలం ముఖం గంటు పెట్టుకున్నాడు. ఆ అమ్మాయి ముఖం చిట్లించుకుంది.

''ఆ ఏడుపేదో ముందే ఏడవలేక పోయావ్? ఓ పావలా ఎక్కువ పారెయ్యా మంటే పారెయ్యనూ?'' అన్నాడు కుర్రాడు ధుమధుమలాడుతూ!

''పావలా కాదు... పది రూపాయలు పారేసినా రాను... ఇట్లాంటి యవ్వారా లకు కాదు నా బండి గుర్రం... నేనూ'' తెగేసి చెప్పాడు వెంకటాద్రి.

''అతగాడితో మనకేమిటి....ఓ రిక్షా చూడు వెడదాం!'' అని కాబోలు ఇంగ్లీ షులో అంటోందా పిల్ల.

''తెగపడ్డ ఆడపిల్ల! బాప్ రే! కాలం! చూడరా ముత్యాలూ!'' అన్నాడు వెంక టాద్రి.

చూస్తుండగానే ఆ ఇద్దరూ ఓ రిక్షాలో కూర్చుని తెర అడ్డువేసుకుని తుర్రున ఎగిరి పోయారు.

''ఇది మరీ బావుంది! మనకెందుకు ఎవరెట్లాంటి వాళ్లయితే? ఎంతకో అంతకు బాడుగకు పోవాలి గానీ, ఇట్లాంటి నియమాలు మనకు కూడు పెడతాయా?'' అంటూ తిట్టిపోసింది శేషమ్మ ఆ సంగతి చెబితే. మెచ్చుకుంటుందని ఆశించిన వెంకటాద్రిని.

అసలీ మధ్య శేషమ్మ కూడా మారిపోయింది! ఒకప్పుడు గర్వకారణంగా వున్న గుర్రమూ, బండీ గుదిబండల్లా వున్నాయి ఆమెకు! తమ వీధిలో ముప్పాతిక మంది మగవాళ్ళు .... తలకో రిక్షా బాడుగకు తెచ్చుకున్నారు.

అప్పుడప్పుడు కొందరు మగవాళ్ళు; సరదాగా, తమ పెళ్ళాల్ని రిక్షాలో సినిమాకీ షికారుకీ తీసుకుపోతున్నారు కూడాను! రోజుకు మూడు నాలుగు రూపాయలు సంపాదించుకొస్తున్నారట బాడుగ పోను! ఇదెంత హాయిగా వుంది! ఆ సైకిలుకు పచ్చి గడ్డి పనిలేదు... కుడితి నీళ్లక్కరలేదు. వులవలు అవసరం లేదు. ఎప్పుడైనా కాస్తంత ఆయిలూ, గాలీచాలు! చెయినో ఏదో చెడితే వేసుకోవటం! శేషమ్మ ఆలోచనలు సరికొత్త దారిలో పడ్డాయి!

ఈ వెధవ గుర్రాన్నీ బండినీ అమ్మిపారేసి, తామూ ఓ రిక్షా తీసుకుంటే తనకీ గడ్డి తెచ్చే కష్టం తప్పుతుంది... తన మొగుడు సరివారిలో గొప్పగా రిక్షా తొక్కుతాడు. తన పిల్లలకూ తిన్నంత తిండి! పై పెచ్చు తను సొంత రిక్షాదారుడి భార్యా!

మొన్నను ఆ సుబ్బులు మొగుడు... ఎవరో ఓ మారాజుని ... ఓ అమ్మాయినీ... అట్లా నాలుగు ఫర్లాంగులు తీసికెళ్ళి వదిలేసి వస్తే పది రూపాయలు ఈనామిచ్చాడట మహానుభావుడు. అసలు రాత్రిళ్ళు ''ఖాతా''లలోనే ఎక్కువ ముట్టుతుందట సుబ్బులు మొగుడికి! ఈ మధ్య దానికో బంగారు గొలుసు కూడా చేయించాడు వాడు.

తన మావ పిచ్చిగానీ తనొక్కడూ మడికట్టుక్కూర్చుంటే కాలం ఆగుతుందా? అందరూ ''అట్లాంటి'' బాడుగల్లో కావలసినంత సంపాదించుకుంటున్నారు. ఇంకా ఈ కూటికి గుడ్డకు తడుముకొనే బ్రతుకెందుకు? రిక్షా కొని తీరాల్సిందే? ఈ పాడు బండిని, గుర్రాన్ని అమ్మి పారేయాల్సిందే!

శేషమ్మ ఆలోచనలు, ఆమె తలలో ఆగక వాగ్రూపంతో బయట పడడానికి ఎక్కువరోజులు పట్టలేదు. వెంకటాద్రికి బయట ఎంత చికాకుగా వుందో, ఇంట్లోనూ అంతటి అశాంతి తయారయ్యింది.... ముత్యాలు రోజురోజుకూ నీరసించి పోతోంది! బాడుగల్లేవు! సరైన పోషణ లేదు. ఇంట్లో శేషమ్మ ఆదరణ అసలే లేదు. పిల్లల దగ్గర్నుంచి 'రిక్షా, రిక్షా' అన్న పాటే. బండి మోటుగా బండలా కనిపిస్తోంది. అందరికీ.

''అది కాదే శేషూ! మీ ఆయనకేం తిక్కా? అందరూ రిక్షా మీద అంతలేసి సంపాదిస్తూంటే, ఈ బండి మెడ క్కట్టుకూర్చున్నాడు'' అంటూ వదినెలూ, అన్నలూ, ఇరుగు పొరుగులూ, చివరకు తండ్రి కూడా ఎగతాళి చెయ్యటంతో... శేషమ్మ తిక్క రేగిపోయింది!

పదిరోజుల క్రితం తెగేసి చెప్పింది.

''నాకు నగలూ నాణ్యాలూ చేయించకుంటేమానె; నాకూ పిల్లలకూ ఇంత కూడయినా పెట్టకుంటే ఏదో చూచుకోవాలి మేము? ఇక గుర్రప్పీనుగే వుండాలో, నేనే వుండాలో తేల్చుకో! తలా కాస్త ''ఎండ్రిన్'' పోసి నేనూ పోసుకుంటా'' అనేసింది.

వెంకటాద్రికి ఊపిరి సలపలేదు.

అతగాడి మౌనం ఆసరాగా తీసుకుని శేషమ్మ. ఓ ''దళారి''ని పట్టుకుని బేరం కూడా కుదిర్చేసింది బండికీ, గుర్రానికీ. అంతేకాదు ఓ కొత్త రిక్షా కొనిపెట్టమని కూడా చెప్పేసింది. అతగాడు రిక్షా ఖరీదు కుదుర్చుకొని వచ్చాడు కూడా!

***

''అన్నానికి రా!''

దగ్గర్లో వినిపించిన శేషమ్మ గొంతుకతో త్రుళ్ళిపడి కూచున్నాడు వెంకటాద్రి.

గతమంతా చెదిరిపోయింది. శేషమ్మ భూతకిలా ఎదుట నిల్చుని వుంది!

''పద వస్తున్నా''

తెల్లవార్లూ నిద్ర పట్టలేదు వెంకటాద్రికి...

తెల్లగా తెల్లారింది. బండినీ గుర్రాన్నీ కొన్న మనిషి ఎవరో మోతుబరి రైతుకు పాలేరు.. వచ్చి కూర్చున్నాడు తోలుకు పోవటానికి...

వాకిట్లో కొత్తరిక్షా వచ్చి నిలచివుంది. మధ్యవర్తి పోలయ్య కూడా నిల్చుని వున్నాడు.

''ఉండు పోలన్నా! శకునవేళ వచ్చావు ఆ బండి గుర్రం అట్టాదాటనీ, ఆ డబ్బు నీ చేతిలో ఇట్లా వేస్తాను... ఇంట్లో అట్టే పెట్టామంటే అదికాస్తా ఖర్చైపోతుంది!'' అంటోంది శేషమ్మ సంతోషంగా....

వెంకటాద్రి వులకలేదు పలకలేదు.

బండికి గుర్రాన్ని కట్టిచ్చాడు. చెలకోల ఆ పాలేరు చేతికిచ్చాడు... ఒక్కసారి గుర్రాన్ని ఆప్యాయంగా నిమిరాడు.

''వెళ్లు ముత్యాలూ! వెళ్లు! మనిద్దరి నీతి, వేగమూ ఇప్పుడెవరికీ అక్కరల్లేదు. నా దగ్గరున్నా ఇక నీకు దిక్కులేని చావే! రిక్షా మోజులో వున్న శేషు ఇక నిన్ను వుట్టినే చంపుతుంది...

అదుగో అక్కడుంది చూడు ఆ రిక్షా! దాని కొత్తచక్రాలూ, ఇనుప కమ్ములూ ఎంత తళతళ మెరుస్తున్నాయో! ఆ మెరుపు నాలుగురోజులే! ఆ తర్వాత అవీ తుప్పు పడతాయి! అయినా ఆ తుప్పు పట్టిన చక్రాలే... ఎంత చక్రమో తిప్పుతున్నాయి!


నేనూ అది తొక్కటం నేర్చుకోవాలి. ఆ తెరలు దించాలి టౌన్‌కు దూరంగా, చాటుమాటుగా ఆపుకోవాలి... గొందుల్లో, సందుల్లో దూరాలి... నీతినీ, అవినీతిని కలగాపులగంగా కలిపి తొక్కాలి. ఒద్దొద్దు నువ్వు ఇలాటివి చూడలేవు – నీకు అలవాటు లేదు. మేం మనుషులం – అలాటిది మాకు స్వతహాగాతే కున్నా. కాలం నేర్పుతుంది. వెళ్ళువెళ్ళు! ఆ రైతెవరో బాగా చూచుకుంటే, హాయిగా బ్రతుకుతావు. నిన్ను ఏ సేద్యగాల్లకో వప్పజెప్పి స్వారీకి మాత్రం తయారైతే ఇక నీ ఖర్మ... వెళ్ళు... వెళ్ళు ఇక ఈ కాలంలో మరెప్పుడూ గుర్రంగా పుట్టకు... ఏ మిషనుగానో పుట్టు, గౌరవం వుంటుంది... అసలు మనమే ఈ కాలానికి సరిపోలేమేమో. అడుగో! నా పెద్దకొడుకు! చూడు! ఆ రిక్షాని చూస్తూ ఎంతగా సంబర పడిపోతున్నాడో! అవును. మరి కాలం మారింది... ఈ కాలానికి అదే తగిందేమో! వెళ్ళు... వెళ్ళు!'' వెంకటాద్రి మూగభాష ముత్యాలుకు అర్థమయింది! తల విదిల్చింది. బండి కదలిపోయింది. శేషమ్మ సైకిల్ రిక్షాకు ఎర్ర నీళ్ళు తిప్పిపోస్తుంది సంబరంగా.

''రిక్షా వాళ్ళు కూడా పస్తులుంటారని తెలిసిన రోజు, ఈ ఎర్రనీళ్ళు మరెవరికి తిప్పుతావే శేషూ?'' అనుకున్నాడు వెంకటాద్రి. అతగాడికి అలవిగాని బాధతో బాటు ఆపుకోలేని నవ్వూ ముంచుకొచ్చింది!

❑

*(''జ్యోతి'' జనవరి 72)*

కవిత poem



## మానవుడు... మహారాక్షసుడు

మనసు పచ్చగా వుంటే కదా
అనుభూతులు ఆర్ద్రంగా వుండడానికి
ఎవరి స్వార్థం వాళ్ళది
వర్తమానం తప్ప భవిష్యత్తు ఎవరికీ అక్కర్లేదు
తాను బ్రతకడు జంతుజాలాన్ని బ్రతకనివ్వడు
డబ్బే పరమావధి
పంచ భూతాలూ పంచేసుకున్నాడు
కనుచూపు మేరా కబళించేశాడు
మరమనిషిలా మారి
బానిసలా మనుగడ సాగిస్తున్నాడు
మానవుడు మహనీయుడు కాదు
మహారాక్షసుడు!

–ప్రతాప వెంకట సుబ్బరాయుడు
**93939 81918**